క్లుప్తంగా

నగదు, వెండి వస్తువులు స్వాధీనం



బంటుమిల్లి: మండల పరిధిలోని పలు రహదారుల్లో పోలీసులు గురువారం ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. ఎస్‌ఐ ఎ. పైడిబాబు తెలిపిన వివరాల ప్రకారం..బంటుమిల్లి నుంచి గుడివాడ, మచిలీపట్నం, నర్సాపురం రహదారుల్లో పోలీసు బృందాలు విస్తృతంగా వాహనాలను తనిఖీ చేశారు. యానాం నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని ఒక వ్యక్తిపై కేసు నమోదు చేశారు. ఎటువంటి ధ్రువీకరణ పత్రాలు లేకుండా రూ. 3.84 లక్షల నగదును విజయవాడ నుంచి అమలాపురం తీసుకువెళుతున్న వ్యక్తిపై కేసు నమోదు చేశారు. అలాగే విజయవాడ నుంచి భీమవరం తరలిస్తున్న సుమారు 15 కిలోల వెండి వస్తువులను స్వాధీనం చేసుకుని విజయవాడకు చెందిన మీనాక్షి సిల్వర్ షాపు యజమానిపై కేసు నమోదు చేశారు. ముమ్మరంగా తనిఖీలు చేసిన ఎస్‌ఐని, సిబ్బందిని సీఐ ఎండీ హబీబ్‌బాషా అభినందించారు.

సమసమాజం కోసం పాటుపడిన అంబేడ్కర్



మచిలీపట్నంటౌన్: దేశంలో సమసమాజ నిర్మాణం కోసం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎంతగానో కృషి చేశారని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్‌ప్రసాద్ అన్నారు. స్థానిక అంబేడ్కర్ సర్కిల్, పోర్టురోడ్డులో ఉన్న అంబేడ్కర్ విగ్రహాలకు ఆయన గురువారం పూలమాల వేసి నివాళులర్పించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయవాడలో ఏర్పాటు చేసిన 125 అడుగుల అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని ఈ నెల 19వ తేదీన ఆవిష్కరిస్తున్న నేపథ్యంతో పాటు విక్టర్‌ప్రసాద్ జన్మదినం కావటంతో అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విక్టర్‌ప్రసాద్ మాట్లాడుతూ అంబేడ్కర్ రచించిన భారత రాజ్యాంగాన్ని అనుసరిస్తూ సీఎం జగన్ పాలన సాగిస్తున్నారని వివరించారు. నిడుమోలులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో విద్యార్థుల మధ్య మారుమూడి విక్టర్ ప్రసాద్ జన్మదిన వేడుకలను జరుపుకొన్నారు. దళిత జేఏసీ జిల్లా అధ్యక్షుడు జక్కుల ఆనంద బాబు, వైఎస్సార్ సీపీ నాయకులు బూరగ రామారావు, చీలి చక్రపాణి, దార్ల చెన్నకేశవ రావు, దళిత జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

ఉత్తమ క్రీడాకారుల గుర్తింపునకే..

ఉత్సాహంగా ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు

నాగాయలంక: ఉత్తమ క్రీడాకారులను గుర్తించేందుకు ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలు దోహదం చేస్తాయని ఎంపీడీఓ చతుర్వేదుల శ్రీనివాస్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి క్రీడా పోటీలు కొనసాగుతున్నాయి. నాగాయలంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ గ్రౌండ్స్‌లో వాలీబాల్, బ్యాడ్మింటన్, ఖోఖో క్రీడలను ఎంపీడీఓ చతుర్వేదుల శ్రీనివాస్ ప్రారంభించారు. 137 మంది క్రీడాకారులు మండల స్థాయిలో ఆడుతున్నారు. తహసీల్దార్ జె.విమలకుమారి, ఎంఈఓ అన్నపరెడ్డి రామారావు, ఈఓపీఆర్డీ కె.అప్పలనరసమ్మ, గ్రామ కార్యదర్శి జరుగు పవన్‌కుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు గాజుల లక్ష్మీప్రసాద్, కోసూరు పూర్ణచంద్రరావు, సీహెచ్ సుబ్బారావు, అధికారులు పాల్గొన్నారు.

● మచిలీపట్నంటౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు గురువారం ఉత్సాహంగా సాగాయి. స్థానిక నోబుల్ కళాశాల క్రీడా మైదానంలో నాలుగు జట్లు, ఆంధ్ర జాతీయ కళాశాల క్రీడా మైదానంలో నాలుగు జట్లు క్రికెట్ పోటీల్లో పాల్గొన్నాయి. వాలీబాల్ ఎనిమిది మ్యాచ్‌లు, కబడ్డీ నాలుగు మ్యాచ్‌లు, ఖోఖో మహిళా విభాగం ఏడు మ్యాచ్‌లు జరిగాయి. ఈ పోటీల్లో పలు డివిజన్లకు చెందిన క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ కనబరిచారు. ఈ పోటీలను చిలకలపూడి పాండురంగ ఉన్నత పాఠశాల పీఈటీ రమేష్‌కుమార్ పర్యవేక్షించారు.

హోరాహోరీగా..

కోనేరుసెంటర్: మండల పరిధిలోని గుండుపాలెం పంచాయతీలో నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. గురువారం ఉదయం జరిగిన కబడ్డీ ఫైనల్ పోటీలో చిన్నాపురం-1 జట్టు తాళ్లపాలెం-1 సచివాలయం జట్టుపై విజయం సాధించి నియోజకవర్గ స్థాయిలో జరిగే పోటీలకు అర్హత సాధించింది. అనంతరం నిర్వహించిన వాలీబాల్ పోటీలు అద్యంతం రసవత్తరంగా సాగాయి. నాకౌట్ విధానంలో జరిగిన పోటీల్లో ఉత్తమ ప్రదర్శన చేసిన తాళ్లపాలెం-1, తాళ్లపాలెం-2 సచివాలయం జట్లు ఫైనల్‌లోకి ప్రవేశించాయి. హోరాహోరీగా జరిగిన ఫైనల్ పోటీలో అత్యుత్తమ ప్రదర్శన చేసిన తాళ్లపాలెం-2 సచివాలయం జట్టు తాళ్లపాలెం-1 సచివాలయం జట్టుపై 30-26 స్కోరు తేడాతో విజయం సాధించింది. వాలీబాల్ విజేతగా నిలిచిన తాళ్లపాలెం-2 సచివాలయం జట్టుకు అరిసేపల్లి పంచాయతీ కార్యదర్శి సుకుమార్ రూ. 1,116ను అందజేసి ఇరుజట్ల క్రీడాకారులను అభినందించారు. పోటీలను ఎంపీడీఓ బాలకృష్ణారావు, ఎంఈఓ దుర్గాప్రసాద్ పర్యవేక్షించగా ఆయా గ్రామాల పెద్దలు, వైఎస్సార్ సీపీ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● గూడూరు: గూడూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం మండల స్థాయి షటిల్ పోటీలు హోరాహోరీగా సాగాయి. సచివాలయ స్థాయిలో సత్తా చాటిన మహిళలు, పురుషుల విభాగాలలో మొత్తం 32 జట్లు మండల స్థాయి పోటీల్లో తలపడ్డాయి. మహిళల విభాగంలో కోకనారాయణపాలెం జట్టు విజేతగా నిలవగా రాయవరం జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. పురుషుల విభాగంలో గూడూరు-1 జట్టు విజయం సాధించగా, రాయవరం జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది.

● బంటుమిల్లి: బంటుమిల్లిలో గురువారం కబడ్డీ ఫైనల్ మ్యాచ్ ఇరు జట్ల మధ్య పోటాపోటీగా సాగింది. 16 సచివాలయాల నుంచి 16 జట్లు పాల్గొనగా 15 మ్యాచ్‌లు జరిగాయి. బంటుమిల్లి-పెదతుమ్మిడి జట్లు ఫైనల్‌లో తలపడగా బంటుమిల్లి జట్టు విజేతగా నిలిచింది. ద్వితీయ స్థానంలో పెదతుమ్మిడి జట్టు నిలిచింది. బంటుమిల్లి జట్టు నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొంటుందని పీడీ మోహన్‌రావు తెలిపారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు సుజ్ఞానం మహేష్, సతీష్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



నాగాయలంకలో ఖోఖో ఆడుతున్న క్రీడాకారులు



బందరులో కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు



బందరులో ఖోఖో మ్యాచ్



షటిల్‌లో తలపడుతున్న గూడూరు-1, రాయవరం జట్లు



కబడ్డీ ఆడుతున్న బంటుమిల్లి-పెదతుమ్మిడి జట్లు

కోడి కత్తులు కలిగి ఉన్న ఇద్దరి అరెస్ట్



పెడన: పట్టణంలో కోడి కత్తులు కలిగి ఉన్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి వారి నుంచి కత్తులను స్వాధీనం చేసుకున్నారు. పెడన ఎస్‌ఐ వి. రవిచంద్రకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం ఉదయం పెడన పట్టణంలోని 11వ వార్డు కోత మిషన్ రోడ్డు చెంచుల కాలనీలో కోడి కత్తులు కలిగి ఉన్నారనే సమాచారంతో పెడన సీఐ హబీబ్‌బాషా ఆధ్వర్యంలో దాడులు చేసి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారి నివాసాలను తనిఖీ చేసి 55 కోడి కత్తులను స్వాధీనం చేసుకున్నారు. మండలంలో జూదం, పేకాట, కోడి పందేలు, అక్రమ మద్యం, సారా విక్రయాలు చేసినా, అసాంఘిక కార్యలాపాలకు పాల్పడినా ఉపేక్షించేది లేదని ఎస్‌ఐ రవిచంద్రకుమార్ హెచ్చరించారు.

అవనిగడ్డ సబ్ డివిజన్‌లో 900 మంది బైండోవర్



చల్లపల్లి: సంక్రాంతి, ఎన్నికల సందర్భాలను పురస్కరించుకుని అవనిగడ్డ సబ్ డివిజన్ పరిధిలో 900 మందిని బైండోవర్ చేసినట్లు అవనిగడ్డ డీఎస్పీ పి.మురళీధర్ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషనులో గురువారం సాయంత్రం డీఎస్పీ మీడియా సమావేశం నిర్వహించారు. సంక్రాంతి నేపథ్యంలో కోడిపందేలు, పేకాట నిర్వహించే వారు, కోడి కత్తులు తయారు చేసేవారు, విక్రయించేవారు, ఎన్నికల నేపథ్యంలో నేర ప్రవృత్తి కలిగిన వారిని 900 మందిని గుర్తించి బైండోవర్ చేసినట్లు తెలిపారు. సంక్రాంతి సందర్భంగా కోడిపందేలు, పేకాట, గుండాట, ఇతర జూదాలు నిర్వహించినా, పాల్గొన్నా చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో సీఐ సీహెచ్ నాగ ప్రసాద్, చల్లపల్లి, మోపిదేవి ఎస్‌ఐలు సీహెచ్ చినబాబు, కేవీజీ ప్రసాద్ పాల్గొన్నారు.

జగనన్నతోనే సంక్షేమ రాజ్యం

● జోగి రాజీవ్

● ఆకుమర్రులో గడప గడపకు మన ప్రభుత్వం

గూడూరు: జగనన్నతోనే సంక్షేమ రాజ్యం సాకారం అయ్యిందని మంత్రి జోగి రమేష్ తనయుడు జోగి రాజీవ్ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గూడూరు మండలం కంచాకోడూరు సచివాలయంల పరిధిలోని ఆకుమర్రు గ్రామంలో గురువారం జరిగింది. ఎంపీపీ సంగా మధుసూదనరావుతో కలిసి రాజీవ్ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా పొందిన లబ్ధిని వివరించి బుక్‌లెట్‌లను పంపిణీ చేశారు. రాజీవ్ మాట్లాడుతూ గతంలో పెన్షన్ తీసుకోవాలంటే పంచాయతీ కార్యాలయం వద్ద రోజుల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. రేషన్ తీసుకోవాలంటే చౌకధరల దుకాణాల ముందు క్యూలో నిలబడాల్సి ఉండేదన్నారు. జగనన్న ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే సచివాలయ వ్యవస్థ, వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసి అర్హతలు ఉన్న ప్రతి కుటుంబానికి గడప వద్దకే సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకున్నారని చెప్పారు. అవ్వాతాతలకు ఠంచనుగా ఒకటో తేదీనే తలుపు తట్టి మరీ పెన్షన్ అందిస్తున్నారన్నారు. ఇళ్ల వద్దకే మొబైల్ వ్యాన్ల ద్వారా రేషన్ పంపిణీ చేస్తున్నామన్నారు. అర్హతే ప్రామాణికంగా కులం, మతం, పార్టీలు చూడకుండా అందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని తెలిపారు. నిరుపేద, మధ్య తరగతి జీవితాలు బాగుపడాలన్నదే లక్ష్యంగా అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని నిండు మనస్సుతో ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ కారుమంచి కామేశ్వరరావు, సర్పంచి బొల్లా కృష్ణకుమారి, ఎంపీడీఓ డి.సుబ్బారావు, తహసీల్దారు బి.విజయప్రసాద్, జక్కా రాజేష్, మాగంటి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న జోగి రాజీవ్, ఎంపీపీ సంగా మధుసూదనరావు

ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు

భోగి మంటలు వేసిన ఎమ్మెల్యే సింహాద్రి

అవనిగడ్డ: స్థానిక ఎస్‌వీఎల్ క్రాంతి జూనియర్ కళాశాలలో గురువారం సంక్రాంతి సంబరాలు ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగాయి. ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, ఏపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు భోగి మంటలు వేసి ఉత్సవాలను ప్రారంభించారు. విద్యార్థులు సరదాగా కోడిపందేలు, పొట్టేళ్ల పందాలు వేశారు. గంగిరెద్దుల విన్యాసాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ముగ్గులు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కళాశాల కరస్పాండెంట్ దుట్టా ఉమామహేశ్వరరావు, ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు కార్యక్రమాన్ని పర్యవేక్షించగా, అధ్యాపకులు సంబరాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.



అవనిగడ్డలో భోగిమంటలు వేస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి, కడవకొల్లు

● పెడన: సహాయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సంక్రాంతి సంబరాలను నిర్వహించడం అభినందనీయమని మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి అన్నారు. స్థానిక దేవాంగ కల్యాణ మండలంలో సహాయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాటల పోటీలను ఆమె గురువారం ప్రారంభించి మాట్లాడారు. గత ఎనిమిదేళ్లగా ప్రజల్లో ఉంటూ సేవా కార్యక్రమాలు చేస్తూ పేదల పక్షపాతిగా సహాయ ఫౌండేషన్ గుర్తింపు తెచ్చుకోవడం హర్షణీయమన్నారు. ఫౌండేషన్ లీగల్ సలహాదారుడు లంకిశెట్టి బాలజీ మాట్లాడుతూ ప్రముఖ పారిశ్రామికవేత్త, ప్రజా సేవకుడు గాజుల సాంబయ్య నాయుడు సహకారంతో సంక్రాంతి సంబరాలు జిల్లా స్థాయిలో పెడనలో ఏర్పాటు చేశామన్నారు. శుక్రవారం ఇదే కల్యాణ మండపంలో డ్యాన్స్ పోటీలు జరుగుతాయన్నారు. 13న పెడన వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో ముగ్గులు, మెహందీ, ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు జరుగుతాయని తెలిపారు. 13వ తేదీ మధ్యాహ్నం నుంచి విజేతలకు, ఆయా పోటీలలో పాల్గొన్న వారికి బహుమతులు అందజేస్తామన్నారు. కాశీపట్నం ఉమా, విజయలక్ష్మి, శ్యామలత న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో సీనియర్ కౌన్సిలర్ కటకం ప్రసాద్, కౌన్సిలర్ పద్మావతి, ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఉస్మాన్ బాషా, అలుగూరి అజయ్, సాంబశివరావు, వెంకటేశ్వరమ్మ, నూర్జహాన్, విజయకుమారి పాల్గొన్నారు.



పాటల పోటీలను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ నాగకుమారి

అంబేడ్కర్ విగ్రహావిష్కరణను జయప్రదం చేయండి


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న జోగి రాజీవ్ తదితరులు

పెడన: ఈ నెల 19న విజయవాడలో జరుగనున్న భారత రాజ్యాంగ నిర్మాణ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహావిష్కరణ కార్యక్రమానికి భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని మంత్రి జోగి రమేష్ తనయుడు జోగి రాజీవ్ అన్నారు. గురువారం పెడన మార్కెట్ యార్డ్ సమావేశ మందిరంలో పెడన నియోజకవర్గ నాయకులు, ప్రజాప్రతినిధులు, ఎస్సీ నాయకులతో ఆయన సమావేశమయ్యారు. రాజీవ్ మాట్లాడుతూ అంబే
డ్కర్ స్మృతివనం, విగ్రహావిష్కరణను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించనున్నారని, ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయడానికి మన వంతు కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు. తొలుత పోస్టర్‌ను ఆవిష్కరించారు. పెడన నియోజకవర్గ పరిధిలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, అంబేడ్కర్ అభిమానులు పాల్గొన్నారు.

రక్తదాతలు ప్రాణదాతలే

రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ బాలాజీ


రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న బాలాజీ, సీఐ నాగప్రసాద్

చల్లపల్లి: ఆపద సమయంలో రక్తదానం చేసే ప్రతిఒక్కరూ ప్రాణదాతలేనని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కృష్ణా జిల్లా చైర్మన్ తోట ఎస్ఎస్ బాలాజీ అన్నారు. గురువారం స్థానిక చంద్ర రాజేశ్వరరావు వికాస కేంద్రంలో ఎస్ఆర్‌వైఎస్‌పీ జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థుల అసోసియేషన్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చల్లపల్లి సబ్ బ్రాంచ్ సంయుక్త ఆధ్వర్యంలో సీఆర్ వికాస కేంద్రం ట్రస్ట్ సహకారంతో స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు. క్లబ్ జిల్లా చైర్మన్ బాలాజీ, జిల్లా కార్యదర్శి, మేనేజర్ భవిరి శంకర్‌నాథ్, సీఐ సీహెచ్ నాగప్రసాద్, తహసీల్దార్ కె.గోపాలకృష్ణ అతిథులుగా విచ్చేసి శిబిరాన్ని ప్రారంభించారు. మచిలీపట్నం పట్టాభి రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ వైద్యులు డాక్టర్ కేవీ శివప్రసాద్, సిబ్బంది తరలివచ్చి రక్తదాతల నుంచి బ్లడ్ యూనిట్లు సేకరించారు. కళాశాల పూర్వ విద్యార్థులు, రెడ్‌క్రాస్ ప్రతినిధులు, గ్రామ ప్రముఖులు 31 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. కార్యక్రమంలో విశ్రాంత ప్రిన్సిపాల్ తగిరిశ సాంబశివరావు, పూర్వ విద్యార్థుల అసోసియేషన్ అధ్యక్షులు గోవిందరాజు అశ్విన్ కుమార్, కార్యదర్శి బీడీఆర్ ప్రసాద్, రెడ్ క్రాస్ చల్లపల్లి అధ్యక్షులు నడకుదురు లీలాబ్రహ్మేంద్ర, ట్రెజరర్ ఎండీఏకే జిలానీ, అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

సూర్యనారాయణస్వామికి చందన అలంకారం



అవనిగడ్డ: స్థానిక సూర్యనారాయణస్వామి ఆలయంలో గురువారం స్వామివారికి చందన అలంకారం చేశారు. ఆలయ అర్చకులు దీవి నరసింహమూర్తి స్వామివారికి ప్రత్యేక అలంకారంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్దఎత్తున పాల్గొని పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త తుంగల వీర వసంతరావు ఇందిరాదేవి దంపతులు పర్యవేక్షించారు.



ఆర్థికసాయం అందజేత

మచిలీపట్నంటౌన్: 28వ డివిజన్‌కు చెందిన అఫ్జలున్నీసా ఇటీవల మృతిచెందారు. తోటి పింఛనుదారులు ఒక్కొక్కరు రూ. 100 చొప్పున సేకరించిన రూ. 37,300లను గురువారం అఫ్జలున్నీసా కుటుంబ సభ్యులకు అందజేశారు. వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జ్ షేక్ మొహమ్మద్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిపథంలో దివిసీమ

అందుబాటులో ఆధునిక వైద్యం



అవనిగడ్డ: విద్యల వాడగా పేరొందిన దివిసీమ నేడు వైద్య, వ్యాపార రంగాల్లో ముందంజలో నిలుస్తోంది. గతంలో ఏ చిన్న ఆరోగ్య సమస్యలు వచ్చినా మచిలీపట్నానికి, లేదంటే విజయవాడకు వెళ్లాల్సి వచ్చేది. నేడు ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. చల్లపల్లి, అవనిగడ్డ కేంద్రంగా మెరుగైన ఆధునిక వైద్యసేవలు అవనిగడ్డ నియోజకవర్గ ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి సంక్షేమ పథకాల అమలు.. ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ప్రత్యేక శ్రద్ధతో దివిసీమలో వైద్య, వ్యాపార రంగాలు బాగా విస్తరించాయి. గర్భిణులు, బాలింతలు, నవజాత శిశువులకు అవనిగడ్డ, చల్లపల్లిలో ప్రైవేటు వైద్యశాలలు కార్పొరేట్ ఆస్పత్రులతో పోటీపడి వైద్యం అందిస్తున్నాయి. కోవిడ్ సమయంలో ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు చొరవతో అవనిగడ్డ ప్రభుత్వ ఏరియా వైద్యశాలతో పాటు కొన్ని ప్రైవేటు వైద్యశాలలు అందించిన వైద్యసేవలు ప్రశంసలు అందుకున్నాయి.

విస్తరిస్తున్న వ్యాపార రంగం..

గత ఐదేళ్లతో పోలిస్తే చల్లపల్లి, అవనిగడ్డ కేంద్రంగా వ్యాపారరంగం బాగా విస్తరించింది. వివాహ, ఇతర వేడుకల సందర్భంగా గతంలో విజయవాడ, గుంటూరు ప్రాంతాలకు వెళ్లి షాపింగ్ చేసే ప్రజలు నేడు చల్లపల్లి, అవనిగడ్డలోనే షాపింగ్ చేసే స్థాయికి ఎదిగాయి. నాణ్యతతో పాటు సరసమైన ధరలకు వస్త్రాలు, ఇతర రకాల వస్తువులు ఈ ప్రాంతాల్లోనే లభ్యమవడంతో ఇక్కడ షాపింగ్ చేసేందుకు ప్రజలు మొగ్గుచూపుతున్నారు. అవనిగడ్డ, చల్లపల్లి ప్రాంతాల్లో పలు రకాల వ్యాపార దుకాణాలు ప్రజలతో కళకళలాడుతున్నాయి.

మెరుగైన వైద్య సేవలు



గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్యసేవలు అందించేందుకు అవనిగడ్డ, నాగాయలంక, చల్లపల్లి మండలాల్లో ఉచిత వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నాము. నంగేగడ్డ, అవనిగడ్డలో నిర్వహించిన మెడికల్ క్యాంపులకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. గర్భిణులు, నవజాత శిశువులు, చిన్నారులకు మా వైద్యశాలలో మెరుగైన సేవలు అందిస్తున్నాం.

–డాక్టర్ సత్యనారాయణ బాదర్ల, హరిత హాస్పటల్

అందుబాటులో గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యం



దివిసీమలో గ్యాస్ట్రో ఎంట్రాలజీ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చాం. గ్రామీణ ప్రాంత ప్రజలకు గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యసేవలు అందించాలన్న సంకల్పంతో చల్లపల్లిలోని పద్మావతి వైద్యశాలలో ప్రతి గురు, శనివారం గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యసేవలు అందిస్తున్నాము.

–డాక్టర్ వరుణ్ దాసరి, పద్మావతి వైద్యశాల

ఆగ్రోఫాంతో లాభాలు



ఆగ్రోపామ్ సాగు వల్ల రైతులు లాభాలు పొందుతున్నారు. ఈ ప్రాంతంలో ఆగ్రో పామ్స్ (ఆయిల్‌పామ్) సాగుకు చర్యలు తీసుకుంటున్నాం. దివిసీమలో 30 నుంచి 40 ఎకరాల్లో ఆయిల్‌పామ్ తోటల పెంపకం చేపట్టేందుకు ఏర్పాటు చేస్తున్నాం. ఒకసారి చెట్లు నాటితే 30 నుంచి 40 సంవత్సరాల వరకూ పంట తీసుకోవచ్చు.

–యు. రాము, ఉండవల్లి ఆగ్రోస్ ఆయిల్‌పామ్, చల్లపల్లి

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మచిలీపట్నంటౌన్: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శుక్రవారం హౌసింగ్ బోర్డు విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రాంతంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఈఈ ఎం. భాస్కరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈడేపల్లి శ్రీనివాస నగర్ కాలనీ, పంచాయతీరాజ్ ఎంప్లాయీస్ కాలనీ, నారాయణపురం, పంబలగూడెం, టెంపుల్ కాలనీ, పాత హౌసింగ్ బోర్డు, కొత్త హౌసింగ్ బోర్డు, మాచవరం, ఆనందపేట, వలందపాలెం ప్రాంతాల్లో ఉదయం 8.30 నుంచి 10.30 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని చెప్పారు.